

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు... (మెయిన్‌లో... )



# మహిళలు కోటీశ్వరులుగా మారాలి

### త్వరలో మహిళలకు పెట్రోల్ బంకులు

### జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** మహిళలు కోటీశ్వరులుగా మారాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ ఆకాంక్షించారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఆలీఫ్ (అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా) గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) మహిళలకు నిర్వహించిన శిక్షణ తరగతులలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ర్యాంప్ (రైసింగ్ అండ్ అక్సిలిరేటింగ్ ఎమ్ఎస్ఎం ఈ పెర్ఫార్మెన్స్) అనేది ప్రపంచ నిధులతో ఎమ్ఎస్ఎస్ఎంఈను బలోపేతం చేసి పథకం, ర్యాంప్ పథకంలో భాగంగా స్వయం సహాయక బృందాలుగా ఎమ్ఎస్ఎమ్ ఈ పరిధిలోకి తెచ్చి వారి అభ్యున్నతి సాధించాలనే సంకల్పంతో పని చేస్తుందని అని, దీనిలో భాగంగా మహిళలను వ్యాపారవేత్తలుగా మారేందుకు 15 రోజుల పరిశ్రమ నిర్వహణ, వ్యాపార ఉత్పత్తుల మార్కెటింగ్ మెలకువలు, నైపుణ్యాభివృద్ధి కోసం శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ అనంతరం ఎస్‌హెచ్‌జి మహిళల కోసం సొంతంగా వ్యాపారం చేయుటకు అవసరమైన సహాయం చేస్తుందని తెలిపారు. మహిళలకు బ్యాంకు లింకేజీల ద్వారా జిల్లాలో 700 కోట్ల రూపాయల ఆర్థిక సాయం చేయడం జరిగిందని, దీని ద్వారా మహిళలు కిరాణం ఫ్యాన్సీ, చీరల దుకాణం, ఏర్పాటు చేసుకున్నారని, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు యూనిఫాం మహిళా సంఘాల ద్వారానే కుట్టించడం జరుగుతుందని, ప్రభుత్వం త్వరలోనే సోలార్ ప్లాంట్స్, గోదాంలు, పెట్రోల్ బంక్‌లు మహిళలచే ఏర్పాటు చేస్తుందని తెలిపారు. వేల కిలోమీటర్ల ప్రయాణం ఒక్క అడుగుతోనే ప్రారంభం అవుతుందని, అలాగే సమాలోచనలు ఉన్న మహిళలు అందరూ కలిసి ప్రణాళికా బద్ధంగా వ్యాపారం చేసి మార్కెటింగ్‌లో మెళకువలు తెలుసుకొని ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేస్తూ మారుతున్న సమాజంకి అనుగుణంగా నైపుణ్యాన్ని నేర్చుకుని డిమాండ్ ఉన్న వాటిలో వ్యాపారం చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలీఫ్ సెక్రటరీ పద్మజ కృపాకర్, డిఆర్‌డి పిడి అప్పారావు, ఎపిడి సురేష్, లక్ష్మీ నారాయణ, డిబియమ్‌లు, ఎపిఎంలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ, కానిస్టేబుల్ మృతి

### మృతులు ఎపిలోని కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ స్వామి



**ప్రజాపక్షం/కోదాడరూరల్:** కేసు నిమిత్తం పోలీసులు ప్రైవేట్ కారును తీసుకుని హైద్రాబాద్‌కు వెళ్తూ ముందు వెళ్తున్న లారీని వెనుకవైపు నుండి ఢీకొన్న ఘటనలో ఓ ఎస్ఐ, కానిస్టేబుల్ మృతి చెందారు. మరొక కానిస్టేబుల్‌కు, కారు డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన కోదాడ మండల పరిధిలోని దుర్గాపురం జాతీయ రహదారి వద్ద గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, కోదాడ పట్టణ సిఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం ముద్దాల అశోక్(43)ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నర్సింహాపురం గ్రామం మండలం వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన ఎస్ఐ ఆలమూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆలమూరు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సుంకర ఖ్రైస్తన్ జీవన్ (31) ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఓ కేసు నిమిత్తం రాజమండ్రి నుండి హైద్రాబాద్‌కు వెళ్తున్న క్రమంలో కోదాడ పట్టణ శివారులోని దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద లారీని వెనుకవైపు నుండి కారు ఢీకొంది. ఎస్ఐ అశోక్, అర్మూన్ ఖ్రైస్తన్ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందారు. కాగా కానిస్టేబుల్ సుబ్రమణ్యస్వామి, ప్రైవేట్ డ్రైవర్ రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డవారిని పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

## పెండింగ్ జీతాలు ఎప్పుడిస్తారు?




**ప్రజాపక్షం/దేవరకొండ:** గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ దేవరకొండ డివిజన్ కమిటి (ఎఐటియుసి) ఆధ్వర్యంలో గురువారం పెండింగ్ వేతనాలు అందించాలని ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 12వేల గ్రామ పంచాయతీలలో దాదాపు 40 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారని వారికి ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, నెలనెల గ్రీన్ చానల్ ద్వారా ఇస్తామన్న జీతాలు ఇవ్వాలని అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని కొన్ని గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యాలయాలు నెల జీతం 3వేల ఇస్తున్నారని వారికి నెలకు రూ.9500 ఇవ్వాలని, నిరక్షరాస్యులుగా ఉన్న వారిని మోసం చేస్తున్నారని అన్నారు. జీపి ట్రాక్టర్ డ్రైవర్లకు ప్రమాదాలు జరుగుతున్న సందర్భంలో వారికి యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు ఆపాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటరాములు, ఎఐటియుసి మండల కార్యదర్శి మల్లయ్య, కార్మికులు వీరయ్య, సైదులు, జవహర్, బొజ్జా, దేవరాజ్, నరేష్, నరసమ్మ, యాదమ్మ, లక్ష్మమ్మ, అంజమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## ఏకత్వంలో భిన్నత్వం సృష్టిస్తున్న బిజెపి

### శాసనసభ డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్




**ప్రజాపక్షం/సూర్యాపేట:** భిన్నత్వంలోఏకత్వంగా ఉన్న భారతదేశంలో బిజెపి పార్టీ హిందుత్వం ముసుగులో ఏకత్వంలో భిన్నత్వాన్ని సృష్టిస్తుందని శాసనసభ డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ అన్నారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సహకారంతో ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అధ్యక్షతన జరిగిన ఆదివాసి కాంగ్రెస్ బునియాది కార్యకర్తల సమ్మేళనం ముగింపు సభలో ఆయన కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, శాసన మండలి సభ్యులు కేతావత్ శంకర్‌నాయక్ లతో కలిసి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఆదివాసి, గిరిజనులకు ఏదైన లబ్ధిచేకూరిందంటే అది కాంగ్రెస్‌పార్టీతోనే చెప్పారు. ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించింది కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అంబాని, అదాని లకు కట్టబెడుతుందని ఆరోపించారు. దేశంలో కార్పోరేట్ వ్యవస్థ, రాచరిక వ్యవస్థను తీసుకవచ్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. బిజెపి కుటిల ప్రయత్నాలను ప్రశ్నించిన ఏకైక వ్యక్తి రాహుల్‌గాంధీ అన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి అయ్యే వరకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని అన్నారు. గత పది సంవత్సరాలుగా పాలించిన పాలకులు ప్రజలకు విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగాలు ఇవ్వకుండా గొర్లు, బర్లు ఇచ్చారని అన్నారు. కాని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ అందరి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమాల్లో గిరిజనుల పాత్ర ఎంతో ఉందన్నారు. ఎక్కడ అయితే గిరిజనులు గౌరవించబడతారో అక్కడ రాజ్యం నాయకులు సంతోషంగా ఉంటారన్నారు. గిరిజనులను విస్మరించినకెసిఆర్ నేడు అధికారం కోల్పోయి ఫాంహౌస్‌లో కూర్చున్నారని చెప్పారు. ప్రకృతిని ప్రేమించే గిరిజనులు చెట్లు, గుట్టలను, పుట్టలను ప్రేమిస్తారని ఆ తర్వాత అదే స్థాయిలో కాంగ్రెస్ పార్టీని గౌరవిస్తారని అన్నారు. రాష్ట్రంలో గిరిజనులు జనరల్ స్థానాల్లో 35 మంది ఎమ్మెల్యేలను గెలిపించారని వారందరు కూడా చట్ట సభలలో గిరిజనుల సమస్యలపై మాట్లాడాలని కోరారు. కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి తండాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే రానున్న పది సంవత్సరాలు కూడా కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందన్నారు. గిరిజనుల అందరూ కాంగ్రెస్ పార్టీకి, సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉండి మనసమస్యలు, హక్కులను సాధించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆదివాసి కాంగ్రెస్ బునియాది శిక్షణ శిబిరం జాతీయ కోఆర్డినేటర్ రాహుల్‌బాల్, కాంగ్రెస్ ఎస్టీసెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కోట్యనాయక్, భూక్యయూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, శిక్షణ శిబిరం ఇన్‌ఛార్జి లింగం, రాణాప్రతాప్, కృష్ణ, శ్రీను, మల్లిఖార్జున్, మోహన్, గుగులోతు నాగు పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలలో ఫీజు దోపిడీని అరికట్టాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ :** పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎంఇఒ కార్యాలయాన్ని బిసి సంఘం నాయకులు ముట్టడించారు. ఈ సందర్భంగా బిసి యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్‌లు మాట్లాడుతూ మిర్యాలగూడలో ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడం వల్ల పేద విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. పాఠశాలల విద్యార్థులే లక్ష్యంగా విద్యా వ్యాపారాన్ని సాగిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి స్కూల్ ఫీజులే కాకుండా బుక్స్, యూనిఫాంలు, టై, బెల్ట్‌ల పేరిట లక్షల రూపాయల ఫీజులు దండకుంటున్నారని అన్నారు. దీనిపై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గంగాధర్, నరేష్, సాంబయ్య, ఉపేందర్, రమేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా లింగస్వామి గౌడ్

**ప్రజాపక్షం/వలిగొండ :** భారతీయ జనతా పార్టీ వలిగొండ మండల శాఖ ప్రధాన కార్యదర్శిగా వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన లోడే లింగస్వామి గౌడ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వికసిత్ భారత్ కార్యశాల సమావేశంలో వలిగొండ మండలానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షులు పాశం భాస్కర్ వలిగొండ మండల ప్రధాన కార్యదర్శిగా లోడే లింగస్వామి గౌడ్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా లోడే లింగస్వామి గౌడ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్‌కి, మండలంలోని జిల్లా, మండల నాయకులకు, పార్టీ సీనియర్ నాయకులకు, బూత్ అధ్యక్షులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ ర్యాలీ

**ప్రజాపక్షం/మాడ్గులపల్లి :** అంతర్జాతీయ డ్రగ్స్ నిర్మూలన దినోత్సవంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఆయా పాఠశాలల విద్యార్థులచేత ఎస్ఐ కృష్ణయ్య ర్యాలి నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలు, గంజాయి వంటి వాటి జోలికి వెళ్లకుండా బుద్ధిగా చదువుకోని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సూచనలు పాటిస్తూ మంచి పౌరులుగా ఎదగాలన్నారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

## పాల సంఘం చైర్మన్‌గా పైళ్ల సుదర్శన్ రెడ్డి ఏకగ్రీవం

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండలంలోని నాంచారి పేటలో మూడోసారి పాల సంఘం చైర్మన్‌గా ఏకగ్రీవంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ పైళ్ళ సుదర్శన్ రెడ్డి ఎన్నికైనారు. డైరెక్టర్లు గంధ మల్ల లింగస్వామి, పీసరి పెంటారెడ్డి, ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, సామ శ్రీనివాస్ రెడ్డి, గందమల్ల ఇస్తారి, బచ్చే ఐలయ్య, సామ మల్లా రెడ్డి, బచ్చే గణేష్, పైళ్ళ దయాకర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సీనియర్ నాయకులు ఇనుగంటి సత్యనారాయణ శర్మ, ఫైళ్ల విట్ఠల్ రెడ్డి, ఫైళ్ల సుధాకర్ రెడ్డి, ఫైళ్ల ప్రసన్నకుమార్ రెడ్డి, ఫైళ్ల రమేష్ రెడ్డి, పీసరి మల్లారెడ్డి, ఫైళ్ల లింగారెడ్డి, ఫైళ్ల శేఖర్ రెడ్డి, కంది వెంకట్రామిరెడ్డి, గంగదారి రమేష్, ఫైళ్ల మల్లారెడ్డి, ముస్కు పుల్లారెడ్డి, ఫైళ్ల జంగారెడ్డి, గంధమల్ల యాదయ్య, నల్ల యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికవర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

* జూలై 9న దేశవ్యాప్త సమ్మె
* సిఐటియు జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ




**ప్రజాపక్షం/చండూరు :** కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ కార్మికలోకానికి పిలుపునిచ్చారు. గురువారం చండూరు మండల కేంద్రంలో సిఐటియూ మునుగోడు నియోజవర్గ జనరల్ బాడీ విస్తృతస్థాయి సమావేశం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చినపాక లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సిఐటియు నాయకులు వరికుప్పల ముత్యాలు, జేరిపోతుల ధనుంజయ్య, మొగుదాల వెంకటేశం, చిట్టిమల్ల లింగయ్య, కోరే లలిత, కత్తుల సైదులు, నల్లగంటి లింగస్వామి పాల్గొన్నారు.

## పేద విద్యార్థికి ట్రిపుల్ ఐటిలో సీటు

కొట్టాయంలో జాయినింగ్‌కు ఆర్థిక ఇబ్బందులు

దాతలు సహకరిస్తే కోర్సు పూర్తి చేసే అవకాశం



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** పేద విద్యార్థికి అత్యున్నతమైన ట్రిపుల్ ఐటిలో సీటు వచ్చింది. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో కోర్సు పూర్తికి వెనుకంజ వేస్తున్నారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణానికి చెందిన కుర్ర శివ వరలక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ఇంజనీరింగ్ 3వ సంవత్సరం చదువుతుండగా, రెండవ కుమారుడు కుర్ర అభిరామ్ ఇంటర్ పూర్తి చేశాడు. కాగా ఇటీవల విడుదలైన జాతీయ స్థాయి మెయిన్స్ పరీక్షలో అభిరామ్ 82శాతం పర్సంటేజీతో కేరళ రాష్ట్రం కొట్టాయంలో ట్రిపుల్ ఐటి కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ సీటు సాధించాడు. 1 నుంచి 7వ తరగతి వరకు పట్టణంలోని అభ్యాస్ స్కూల్‌లో చదవగా, 8 నుంచి 10వ తరగతి వరకు బకల్‌వాడి ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్‌లో 75శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించగా, జాతీయ స్థాయి మెయిన్స్ పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు సాధించాడు. ఆర్థిక పరిస్థితి సహకరించక కోర్సు పూర్తికి ప్రతి ఏడాది రూ.1.70లక్షలు ఫీజులు చెల్లించాలని పేర్కొనడంతో సతమతమవుతున్నాడు. నాలుగున్నేరళ్ల కోర్సుకు రూ.6లక్షలకు పైగా ఖర్చు ఉంటుందని విద్యార్థి కుర్ర అభిరామ్ తెలిపాడు. దాతలు సహకరిస్తే భవిష్యత్తులో కంప్యూటర్ ఇంజనీరై పేద ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. దాతలు +917995259310 నెంబర్‌ను సంప్రదించాలని కోరాడు.

## ఎమర్జెన్సీలో ప్రజలు మానవహక్కులు కోల్పోయారు

ఎఐకెఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వక్కంతుల కోటేశ్వరరావు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** 1975 జూన్ 25న అర్ధరాత్రి ప్రధానమంత్రి ఇందిరమ్మ నాడు ఏకీకృత నియంతృత్వ ఆధిపత్య రాజ్యాధికార స్థిరీకరణ కోసం ఎమర్జెన్సీని ప్రకటించి దేశంలో 24 నెలలు ప్రజలు స్వేచ్ఛ, మానవ హక్కులను హరించి అనేక మంది ప్రతిపక్ష నాయకులను జైళ్లలో నిర్భందించి, ఊచకోత కోశారని ఎఐకెఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వక్కంతుల కోటేశ్వరరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఇందిరమ్మ ఎమర్జెన్సీకి 50 ఏళ్లు నిండిన సందర్భంగా నల్లక్లాత్‌లను ప్రదర్శిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంపై, ప్రజాస్వామ్యంపై ఇందిరమ్మ ఎమర్జెన్సీ పేరుతో మెట్టమొదటి దాడి కొనసాగించి ప్రపంచ ప్రజల ముందు కాంగ్రెస్ నరహంతక పరిపాలన బహిర్గతం అయిందని అన్నారు. దేశంలో తమ కాంగ్రెస్ పార్టీకి మరో ప్రతిపక్షపార్టీకి పోటీ లేకుండా ఉండాలని, ఆధిపత్య రాజ్యాధికార స్థిరీకరణ కోసం రాయబరోలీలో ఇందిరమ్మ పార్లమెంట్ సభ్యత్వంను అలహాబాద్‌లో హైకోర్టు రద్దు చేస్తూ తీర్పునివ్వడంతో అసహనికి గురైందని, ప్రజల నుండి వ్యతిరేకత ఏర్పడటంతో ఎమర్జెన్సీ ప్రకటించారని, దేశం అల్లకల్లోలం అయిందన్నారు. నేడు మోదీ అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తూ ప్రజాస్వామ్యంను విచ్ఛిన్నం చేస్తూ మానవ నరమేధాన్ని కొనసాగిస్తున్నారని, దీంతో దేశ ప్రజలు ప్రమాదకర, ఫాసిస్టు విధానాలను పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. అటవీ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు ఆదివాసులను, మావోయిస్టులను ఆపరేషన్ కగార్ పేరుతో అత్యంత క్రూరంగా అణిచివేస్తున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి నాయకులు దేవిడ్‌కుమార్, నాయకులు గంటా నాగయ్య, పోటు లక్ష్మయ్య, బొడ్డుశంకర్, కునుకుంట్ల సైదులు, ఉదయగిరి, కంచనపల్లి సైదులు, పోలేబోయిన కిరణ్, పెద్దింటి రంగారెడ్డి, కాకి మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, నర్సింహరావు, పుల్లూరి సింహాద్రి, బండి రవి పాల్గొన్నారు.

## భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ

గీతపనివారల సంఘం మండల 15వ మహాసభ

**ప్రజాపక్షం/చండూరు :** నేడు చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాదగోని నర్సింహ్మ భవనంలో జరుగు గీత పనివారల సంఘం చండూరు మండల 15వ మహాసభను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్ష,కార్యదర్శులు గంట రమేష్, గంట నగేష్ పిలుపునిచ్చారు. మండల మహాసభకు ముఖ్య అతిథులుగా గీతపనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి పబ్బు వీరస్వామి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లె శంకరయ్య హాజరుకానున్నారని తెలిపారు. మహాసభలో గీతపనివారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణను నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు.



## మానవ మనుగడకు చెట్లే జీవనాధారం

**ప్రజాపక్షం/చండూరు :** మానవ జనుగడకు చెట్లే జీవనాదారమని శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ సామ యాదవరెడ్డి అన్నారు. గురువారం చండూరు మున్సిపాలిటీ పరిధిలోని లక్కినేనిగూడెంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయం చుట్టూ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ యాదవరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కళ్లెం సురేందర్‌రెడ్డి, పాశం నర్సిరెడ్డి , కళ్లెం సైదులు రెడ్డి , చొప్పరి నర్సింహ్మా, కారింగు రాజు, బాచుపల్లి కిషన్ రావు, సురుగంటి బుచ్చిరెడ్డి, ఆలయ పూజారి పున్న వేణు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కట్ట కృష్ణ గౌడ్ 8వ వర్ధంతి

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** బొమ్మలరామారం గ్రామ మాజీ సర్పంచ్, మాజీ సింగల్ విండో చైర్మన్, దివంగత కట్ట కృష్ణగౌడ్ ఎనిమిదో వర్ధంతి వేడుకలు వారి కుమారుడు కట్ట శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి హాజరై ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవలు మరువలేనివని వారి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, మాజీ ఎంపిపి సుధీర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సింగల్ విండో చైర్మన్ బాల నరసింహ్మా, చిలువేరు రాజ మల్లారెడ్డి, సోలిపేట మాజీ సర్పంచ్ నవీన్ గౌడ్, కొండోజు ఆంజనేయులు, ఆనంద్, మర్రి కృష్ణారెడ్డి, మచ్చ శ్రీనివాస్ గౌడ్, వంగ మధుసూదన్ రెడ్డి, గ్రామస్తులు నాయకులు పాల్గొన్నారు.

## వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** అన్ని సౌకర్యాలు వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ కోరారు. గురువారం ఆయన పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి బిపి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కావలసిన సత్వర సౌకర్యాలను డాక్టర్ శ్రీవాణిని అడిగి తెలుసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ వార్డులలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. వ్యాధిగ్రస్తులకు ఏఏ పరీక్షలు అందుబాటులో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో రైతులు పంట పొలాల వద్ద పనులు చేసుకుంటున్న సందర్భంలో పాము కాటుకు గురైనప్పుడు యాంటీ స్నేక్ పాయిజన్ వ్యాక్సిన్సు అందుబాటులో ఉన్నాయా లేదా అని డాక్టర్లను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర వైద్య సేవలు అందించే విధంగా సంసిద్ధంగా ఉండాలని డాక్టర్లను కోరారు. షుగర్ పేషెంట్లకు ఇన్సులిన్ ఇంజక్షన్ ట్యాబ్లెట్స్ ఇతర రోగులకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. రోగులతో ప్రేమగా మాట్లాడి ప్రభుత్వ ఆస్తులు ఆస్పత్రుల పట్ల నమ్మకం కలిగేలా ప్రవర్తించాలని డాక్టర్లకు సూచించారు.

## సిపిఐ మండల కార్యదర్శిగా మారుపాక వెంకటేశం



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మండల కార్యదర్శిగా మారుపాక వెంకటేశం, సహాయ కార్యదర్శిగా ఎండి నయీమ్, బత్తిని నరేష్ లను బుధవారం జరిగిన 13వ మండల మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, సిపిఐ సీనియర్ నాయకులకు, మండల నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రజా సమస్యల పైన పోరాడతామని,ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను అర్హులైన పేదవారికి అందేలా పోరాటం చేమన్నారు. ప్రభుత్వం అర్హులైన పేదవారికి రేషన్ కార్డులు త్వరలోనే ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్లను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే కాకుండా, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని లేనిపక్షంలో భవిష్యత్తులో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.



## పార్టీ అభివృద్ధికి కృషిచేయాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అందరూ కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నల్లగొండ మాజీ శాసనసభ్యుడు కంచర్ల భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని విటి కాలనీలో గల కంచర్ల నివాసంలో 47 వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు అంబటి నాగరాజు ఆ పార్టీకి రాజీనామా చేసి కంచర్ల భూపాల్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కంచర్ల వారికి గులాబీ కండువా కప్పి, పార్టీలోకి సాదరపూర్వకంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, సీనియర్ నాయకులు సింగం రామ్మోహన్, మండల పార్టీ అధ్యక్షులు దేప వెంకట్‌రెడ్డి, రంజిత్, అనిల్ నాయక్, జైచందన్ ఉన్నారు.



## డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత

**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** డ్రగ్స్ నిర్మూలనలో విద్యార్థులు, యువత ముఖ్య బాధ్యత వహించాలని ఎక్సైజ్ సిఐ ఎల్.మహేశ్వర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా స్థానిక కెవిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ అమ్మడం, కొనడం, సేవించడం నేరమని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఉన్నత చదువులు అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.శివకృష్ణ, ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్, నరేష్, నాగరాజు, లావణ్య, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ కట్టడిలో యువతదే కీలక పాత్ర



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** డ్రగ్స్ పూర్తిగా కట్టడి చేయడంలో నియంత్రించడంలో యువతదే కీలక పాత్ర అని పోచంపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపారు. ప్రపంచ యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా గురువారం ఆయన పట్టణ కేంద్రంలో నేతాజీ చౌరస్తా వద్ద యువకులతో ఆయన మాదకద్రవ్యాల నియంత్రణ అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. కూడలిలోని జన సమూహామంతా అటెన్షన్ పే చేసేందుకు ఆయన వినూత్నంగా యువకులతో డోలు భాజాలతో డ్రగ్స్ మహమ్మారిని సమూలంగా అరికట్టాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ బారిన పడకుండా యువతను కాపాడుదాం డ్రగ్స్ ను సమూలంగా అరికడదాం అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. సమాజాన్ని యువత బంగారు భవిష్యత్తును పెడదారి పట్టిస్తున్న డ్రగ్స్ భూతాన్ని తరిమివేయాలని కోరారు. డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించినా, సేవించిన వారి వివరాలు తెలిసినా 1908 నెంబర్‌కు కాల్ చేసి చెప్పాలని తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని చెప్పారు. ఇచ్చిన సమాచారంతో దర్యాప్తు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు యువత మొదట సరదాగా అలవాటయ్యి బానిసలుగా మారిపోయి వికృత చేష్టలు, మతిస్థిమితం కోల్పోవడం, పునరుత్పాదక శక్తిని కోల్పోవడం జరుగుతుందని ఎట్టి పరిస్థితుల్లో మాదకద్రవ్యాల జోలికి వెళ్ళకూడదని ఆయన యువతను కోరారు.

మాదకద్రవ్యాలు సరఫరా చేసినా, అమ్మినా, సేవించినా, సహకరించిన వారి పట్ల కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. మాదకద్రవ్య రహిత సురక్షితమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయన వెంట పోలీస్ కానిస్టేబుల్స్ యువతీ యువకులు ఈ కార్యక్రమంలో ఉన్నారు.

## మహాసభలకు సంస్థాన్ నారాయణపురం ఎరుపుమయం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో రేపు నిర్వహించబోయే సిపిఐ మండల 15వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా కార్యకర్తలు ఎర్ర చీర, కామ్రేడ్స్ ఎర్రచొక్కలు ధరించి రావలసిందిగా విజ్ఞప్తి చేశారు. మహాసభల సందర్భంగా మండల కేంద్రంలోని ధర్మ బిక్షం, అల్లూరి, భగత్ సింగ్, అంబేద్కర్, మహనీయుల విగ్రహాల వద్ద ఎరుపు తోరణాలతో ఎర్రజెండాలు కట్టి సంస్థాన్ నారాయణపురం ఎరుపుమయంతో ముస్తాబు చేశారు. మహాసభ ప్రాంగణానికి అమరజీవి కరిమిద్ద లింగయ్య పేరు పెట్టారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి గోదా శ్రీరాములు, నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, వీర మల్ల యాదయ్య, పందుల యాదగిరి, పల్లె మల్లారెడ్డి, కొండూరు విష్ణు, మంచాల జంగయ్య, కిరణ్ పాల్గొన్నారు.

## కంకర పోశారు.. 'బిటి' వేయడం మరిచారు

**ప్రజాపక్షం/డిండి :** డిండి మండలంలోని పలు గ్రామాలకు బిటి రోడ్లు మంజూరు కావడం జరిగింది. అందులో గర్జాల్ తండా, దాక్యతండా, వావిలికోల్, వద్దెరగూడెం, రాస్యతండా, సోమ్లాతండా, బొగ్గుల దోన గ్రామాలకు బిటి రోడ్లు మంజూరు అయ్యాయి. కానీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా కేవలం కంకర, డస్ట్ పోసి వదిలేశారు. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలం కావడంతో వాన వస్తే డస్ట్ మొత్తం బురదలాగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని వాహనదారులు వాపోతున్నారు. సదరు కాంట్రాక్టర్‌లను అడిగితే బిల్లులు రాకపోవడంతో బీటి వేయలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజలు వాహనదారుల సౌకర్యార్థం వీలైనంత త్వరగా బీటి రోడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

**కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి, త్వరగా బిటి నిర్మాణం చేయాలి : ముత్యాలు**

మండలంలో బిటి వేయకుండా అర్ధాంతరంగా మిగిలిపోయిన రోడ్లకు బిటి నిర్మాణం చేయాలని, అదే తరుణంలో సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని బిఆర్ఎస్ వావిలికోల్ వద్దెర గూడెం గ్రామశాఖ అధ్యక్షులు ఓర్సు ముత్యాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం

### మాజీ ఎమ్మెల్యే నోముల భగత్



**ప్రజాపక్షం/హాలియా :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందని సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. గురువారం హాలియాలోని మాజీ ఎమ్మెల్యే భగత్ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలం అయినప్పటికీ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రజలకు ఏం న్యాయం చేసి సంబరాలు చేసుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చకుండా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు. రెండు పంట సీజన్లకు రైతు భరోసా ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో అమలైన ఏ ఒక్క పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కామెర్ల జానయ్య, జవ్వాజి వెంకటేశ్వర్లు, పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, వడ్డే సతీష్ రెడ్డి,సురభి రాంబాబు, తాటి సత్యపాల్, అనుముల శ్రీనివాసరెడ్డి, పిడిగం నాగయ్య, మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాల (డ్రగ్స్) వ్యతిరేక అవగాహన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మాదకద్రవ్యాల(డ్రగ్స్) వ్యతిరేక అవగాహనవారంలో భాగంగా గురువారం తుర్కపల్లి మండలంలోని రాంపూర్లో ప్రభుత్వ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో తుర్కపల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్ మాట్లాడుతూ విద్యార్థి దశలో పిల్లలు మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండాలని, సమాజంలో యువత చెడు దారుల్లో పోవొద్దని, చెడుదారుల్లో వెళ్లే కొందర్ని అనుసరించి విద్యార్థులు ఎవరు కూడా డ్రగ్స్ అని గంజాయి అని తెలిసి తెలియక తప్పులు చేయొద్దని సూచించారు. విద్యార్థి దశనుంచే సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు వచ్చేలా చదువుకోవాలని విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల చెడు పరిణామాలపై ఉన్న పోస్టర్ల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ఉపాధ్యాయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## గంధమల్ల రవి కుటుంబానికి 'కల్లూరి' ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/యాదాద్రి :** ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామానికి చెందిన గంధమల్ల రవి కుటుంబ సభ్యులను గురువారం బిఆర్ఎస్ రాష్ట నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి పరామర్శించారు. గంధ మల్ల రవి యాదగిరిగుట్టలోని ఆలేరు శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య నివాసంలో ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. రవి కుమార్తెల ఉన్నత చదువుల నిమిత్తం రూ.50వేలు ఆర్థిక సహాయం చేశారు. ఆడ పిల్లల చదువులకు ఎల్లవేళలా అండగా ఉంటానని రాంచంద్రా రెడ్డి హామీ ఇచ్చారు. ఆయన వెంట సైదాపురం బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నంద సిద్దులు, మాజీ ఎంపిటిసి బీర్ల మహేష్, మాజీ వార్డు సభ్యులు కుమార్, మాసాయిపేట బిఆర్ఎస్ నాయకులు బండ సిద్దులు, స్వామి తదితరులు ఉన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన

### ఎంఇఒ బాలునాయక్

**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మకమైన విద్యాబోధన జరుగుతుందని ఎంఇవో బాలునాయక్ అన్నారు. గురువారం మండలంలోని చింతపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించడంతోపాటు ఇందిరమ్మ కాలనీలో బడిబాట కార్యక్రమం నిర్వహించి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మౌలిక వసతుల నడుమ మెరుగైన విద్యాబోధన అందిస్తున్నందున విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించి బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు

# మాదకద్రవ్య రహిత సమాజం కోసం యువత పాటుపడాలి



**ప్రజాపక్షం /నందికొండ:**అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక మహాత్మజ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ మాధవి లత ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మిషన్ పరివర్తన్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని నందికొండ సిఐ శ్రీను నాయక్ తెలిపారు.మొదట కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ముత్తయ్య, కళాశాల అధ్యాపకులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మత్తు పదార్థాలతో జీవితం అంధకారంగా మారుతుందని కొండమల్లేపల్లి ఇంచార్జీ సిఐ రాజు అన్నారు. జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం, యాంటీ డ్రగ్ వీక్ సందర్భంలో భాగంగా గురువారం కొండమల్లేపల్లి చౌరస్తాలో పాఠశాల విద్యార్థులతో కలిసి పోలీసులు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వద్దు జీవితం ముద్దు అని యువతకు సూచించారు. ఎంఈవో నాగేశ్వర్ రావు, ఎస్ఐ అజ్మీర రమేష్, ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, కట్టేబోయిన శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం /హాలియా:** మనిషి జీవితాన్ని పూర్తిగా చిందరం చేసే డ్రగ్స్ పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హాలియా సీఐ దేవి రెడ్డి సతీష్ రెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రమైన హాలియాలో వివిధ పాఠశాలల విద్యార్థులతో ఏర్పాటుచేసిన డ్రగ్స్ పై అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ ను బహిష్కరిస్తామని వాటిని దరిచేరకుండా చూస్తామని విద్యార్థులతో సీఐ సతీష్ రెడ్డి, ఎస్సై సాయి ప్రశాంత్ లు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం ఎంత ప్రమాదమో ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని సూచించారు. మనిషి జీవితాన్ని ఊబిలోకి తీసుకువెళ్లే ఈ మత్తు పదార్థాల వాడకం ఎంతో ప్రమాదమని వివరించారు. ఎక్సైజ్ సీఐ పావని, హాలియా ఎస్సై సాయి ప్రశాంత్, ఎక్సైజ్ ఎస్ఐ సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, కాకునూరి నారాయణ గౌడ్,ఎడవల్లి నరేందర్ రెడ్డి, ఎంఈఓ గుండా కృష్ణమూర్తి, వెంకట్ రామ్ రెడ్డి, కట్టెబోయిన అనిల్ కుమార్, వర్ర వెంకటరెడ్డి, శ్రావణ్ కుమార్, పి ఈ టి రాంబాబు వివిధ స్థాయిల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజా పక్షం/తిరుమలగిరి సాగర్:** మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థినీలు ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వీరశేఖర్, మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు, గురువారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్లోయాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వీక్ లో భాగంగా గ్రామంలోని అన్ని పాఠశాలల విద్యార్థిని , విద్యార్థులతో ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకి ప్రతి ఒక్కరు క్రియశీలభాగస్వామ్యులు కావాలని అందరి చే ప్రతిజ్ఞ చేయించడం జరిగిందని అన్నారు,ఈ కార్యక్రమం లో పోలిస్ స్టేషన్ సిబ్బంది,కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయురాలు,గ్రేటవే స్కూల్ సిబ్బంది,ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ చౌటుప్పల్ :** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలని భువనగిరి జిల్లా చౌటుప్పల్ డివిజన్ ఏసీపీ పటోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ డ్రగ్స్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం చౌటుప్పల్ బస్టాండ్ ఆవరణలో పాఠశాలల విద్యార్థులచేత ర్యాలీ నిర్వహించి యాంటి డ్రగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ వేగవంతం గా సులభ పద్ధతి ద్వారా డబ్బు సంపాధించాలన్న కారణంతో చాలా మంది అక్రమ గంజాయి రవాణా,మరియు మత్తు పాదార్థాలకు బానిసలను చేస్తున్నారని, పాఠశాలలు కళాశాలల వద్ద చాక్లెట్‌లలో కూడా మత్తు పాదార్థాలు కలిపి అమ్మకాలు జరుపుతున్నారని యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకుని జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, వాటికి దూరంగా ఉండాలని బస్టాండు ఆవరణలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పోలిస్ ఇన్స్పెక్టర్ మన్మధ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ యాదగిరిలతో పాటు తదితర పోలీస్ సిబ్బంది, ప్రయానికులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో అంతర్జాతీయ మారక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో సిఐ రాములు మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి బానిసలుగా మారి తమ మేధాశక్తిని వృధా చేసుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై జె.జగన్, ఏఎస్ఐ శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, సాయికుమార్, లింగారెడ్డి, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మారక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని, డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు రవాణా జరుగుతున్నట్లు, వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మోటకొండూర్ ఏఎస్ఐ మల్లేష్ తెలిపారు. ఆయన మోటకొండూర్ మండలంలోని చందేపల్లి అర్బన్ గురుకుల బాలుర పాఠశాలలో ప్రపంచ మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్లు మధు, జాన్ రెడ్డి,ఎస్ పి ఓ నారాయణ, ప్రిన్సిపల్ రమేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గుండాల;** మాదక ద్రవ్యాల నిషేదిక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని ప్రధానమంత్రి రైసింగ్ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వాడకంపై గుండాల ఎస్ఐ సైదులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న మత్తు పదార్థాలను, డ్రగ్ మాఫియాను అరికట్టాలని దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉన్నట్లయితే మార్పు జరుగుతుందని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ప్రవర్తను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించి, జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. మత్తు పదార్థాల వాడకంతో జీవితంతో పాటు కుటుంబాలు కూడా నాశనం అవుతాయని తెలిపారు. ఇటీవల గ్రామాలలో గంజాయితో పాటు మాదక ద్రవ్యాలు విచ్చలవీడిగా వాడుతున్నారని మాదక ద్రవ్యాలు వాడిన, విక్రయించిన సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నాగార్జున ప్రభుత్వ కళాశాల (అటానమస్) లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ను ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ గారి అధ్యక్షతన ఎన్సిసి,ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరిలో చైతన్యం కల్పించుటకు ప్రతిజ్ఞ చేయడంతో పాటు, పోస్టర్స్ ప్రదర్శనచేసి మాదకద్రవ్యాలను ఉపయోగించడం వలన కలిగే అనార్థాలను ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ గారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్సిసి కేర్ సిహెచ్ సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎన్ కోటయ్య, డాక్టర్ మల్లేశం, బి. అనిల్ కుమార్. కె శివరాణి,ఎం సావిత్రి బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.






# అక్రమ సంబంధానికి అడ్డొస్తాడని... హత్యకు కుట్ర



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రానికి చెందిన నవ వరుడు గద్వాల్ జిల్లా కేంద్రానికి చెందిన నవ వరుడు అయిన ప్రైవేటు సర్వేయర్ హత్యకేసు మిస్టరీ వీడింది. రూ.2 లక్షలు సుఫారి ఇచ్చి మర్డర్ చేయించినట్టు తెలిసింది. అక్రమ సంబంధానికి అడ్డు పడుతున్నాడని తన భర్తను అంతమొందించాలనుకుంది. ప్రియుడితో కలిసి పథకం వేసింది. ఈ క్రమంలో రూ.2 లక్షలు సుఫారి ఇచ్చి భర్తను హత్య చేయించి కర్నూల్ జిల్లా పాణ్యం సమీపంలో నిర్మిస్తున్న కాలువ సమీపంలో మృతదేహాన్ని పాడేసి వెళ్లారు. మొదట నవవరుడు కనిపించలేదని కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గద్వాల పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. జూన్ 21 న మృతదేహం లభించడంతో దర్యాప్తును వేగవంతం చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో సర్వేయర్ హత్య కేసులో 8 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి ఒక కారు, 2 ఎరుకలి కొడవల్లు, 1 కత్తి, రూ. 1,20,000 నగదు, 10 మొబైల్ ఫోన్‌లు, జీపీఎస్ ట్రాకర్ స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలు గురువారం జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావుతెలిపారు.

**తేజేశ్వర్‌తో ఐశ్వర్య వివాహం**

గద్వాల పట్టణం గంట వీధికి చెందిన గంట తేజేశ్వర్ 32 వృత్తిరీత్యా లైసెన్స్ సర్వేయర్ ఈ క్రమంలో కర్నూల్ జిల్లాకు చెందిన కల్లూరు కు చెందిన సుజాత కూతురు ఐశ్వర్యతో గత ఏడాది డిసెంబర్ తో ఎంగేజ్‌మెంట్ జరిగింది. మే 18న బీచుపల్లి ఆంజనేయస్వామి సన్నిధిలో తేజేశ్వర్, ఐశ్వర్యల వివాహం జరిగింది. గద్వాల పరిసర ప్రాంతాలలో కొనడానికి వ్యవసాయ భూములు కావాలని కర్నూల్ కు చెందిన గుర్తు తెలియని వ్యక్తులు జూన్ 17న ఓ కారులో ఎక్కించుకుని వెళ్లారు. తేజేశ్వర్ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూన్ 21న పాణ్యం వద్ద గుర్తు తెలియని మృతదేహం లభించడంతో అది తేజేశ్వర్ దిగా గుర్తించారు. అప్పటికే తేజేశ్వర్ భార్య ఐశ్వర్యపై అనుమానం వ్యక్తం చేయడంతో ఐశ్వర్యతో పాటు తల్లి సుజాత పోన్‌లు స్వాధీనం చేసుకుని కాల్‌డేటా సేకరించారు. అక్రమ సంబంధాన్ని అడ్డు వస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను సుఫారి గ్యాంగ్ తో హత్య చేయించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వీరి స్టేట్మెంట్ ఆధారంగా హత్యకు ప్లాన్ వేసిన తేజేశ్వర్ భార్య ఐశ్వర్యను గద్వాలలో సహకరించిన మోహన్‌ను జమ్మిచేడులో తిరుపతయ్య, సుజాతలను కర్నూలులో అరెస్టు చేశారు. నిందితుల నుండి ఒక కారు, 2 ఎరుకలి కొడవల్లు, 1 కత్తి, రూ.1,20,000 నగదు 10 మొబైల్ ఫోన్‌లు, జీపీఎస్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్ కు తరలించారు.

**పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ**

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టించిన కేసును అతి తక్కువ సమయంలో ఛేదించడం లో ప్రతిభ చూపిన గద్వాల పట్టణ ఎస్సై కళ్యాణ్ కుమార్తె రూరల్ ఎస్సై శ్రీకాంత్ , ధరూర్ ఎస్సై కొండా శ్రీహరి, మల్దకల్ ఎస్సై నందికర్, గట్టు ఎస్సై మల్లేష్, ఐటీ సెల్ ఎస్సై షకూర్, పి.ఎస్సైలు స్వాతి, తేజేశ్విని, సిబ్బంది చంద్రయ్య, రాజు యాదవ్, రామకృష్ణ, కిరణ్ కుమార్, వీరేశ్, రవి కుమార్, కార్తీక్‌లను జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు క్యాష్ రివార్డ్‌తో ప్రత్యేకంగా అభినందించారు.

# చిన్నారుల అశ్లీల వీడియో చిత్రాలు సర్క్యులేటర్లపై చర్యలు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ యాదాద్రి భువనగిరి అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు ఆదేశాల మేరకు సంస్థ కార్యదర్శి వి.మాధవి లత యాదాద్రి భువనగిరి జిల్లా బాల సంక్షేమ సమితి అధ్యక్షులు బండారు జయశ్రీ, సభ్యులు శివరాజు, రుద్రమదేవి, ఇస్తారి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, యాదగిరి గుట్ట ఎసిపి శ్రీనివాస్ నాయుడు, డిసిపిఒ కవిత, జిల్లా మానసిక వైద్య అధికారి డాక్టర్ ప్రీతి స్వరూప్, డియంహెచ్ఒ ప్రోగ్రాం అధికారి డా.వీణ, బి.ఆర్.బి కోఆర్డినేటర్ సిహెచ్ అనంతలక్ష్మి లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటీవల చిన్నారుల అశ్లీల వీడియో చిత్రాలను సర్క్యులేట్ చేస్తూన్న వారిపై కేసులు రిజిస్టర్ అయ్యాయని, ఇది నాగరిక సమాజం సిగ్గు పడే చర్యలని, వీటిని నివారించటానికి జిల్లా వ్యాప్తంగా అనేక అవగాహన కార్యమాలు నిర్వహించాలని, బాలలపై జరుగు అకృత్యాలను నివారించటానికి కఠిన చర్యలు తీసుకోవాలని తెలియచేసి, శాఖ పరంగా కార్యాచరణ రూపొందించటానికి తగిన సూచనలు చేసారు. జిల్లా వ్యాప్తంగా వైకల్యంతో ఉన్న చిన్నారులను గుర్తించి వారికి సర్టిఫికెట్‌లను జారీచేయటానికి, పల్స్ పోలియో క్యాంపులను నిర్వహించటానికి సంబంధిత శాఖలు ప్రతీ గ్రామములో ఇంటి సర్వే నిర్వహించాలని కోరారు. సమావేశములో పాల్గొన్న జిల్లా విద్యా శాఖ వారు చేసిన సర్వేలో దాదాపుగా 2430 చిన్నారులను వివిధ వైకల్యంతో బాధపడుతున్నట్లు గుర్తించటం జరిగిందని ఇందులో ఒకటవ క్లాస్ నుండి 12 క్లాస్ వరకు ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా 17 భవిత పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. ఒక్కొక్క గ్రామములో వైకల్యం ఉన్న చిన్నారులకు వైద్య సదుపాయాలు, వైకల్య ధృవీకరణ పత్రాలు అందచేయటం, పల్స్ పోలియో క్యాంపులు నిర్వహించటం చేయాలని, సంబంధిత శాఖలు న్యాయ సేవా సంస్థకు సహకరించాలని తెలియచేసారు.

## మోడల్ స్కూల్ ఆర్డిఒ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండల కేంద్రంలో ని తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి తో కలిసి గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల సిబ్బంది బోధన విధానం పట్ల, హాజరు రికార్డు పలు అంశాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజారయ్యతో చర్చించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యత గల భోజనం అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కి సూచించారు. అనంతరం హాస్టల్లో ఉన్న బాలికలను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో తరగతి గదిలలో డైనింగ్ హాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, హాస్టల్లో ఉన్న విద్యార్థుల పట్ల జాగ్రత్త వహించాలని వార్డెన్ వాచ్మెన్ ఎప్పుడైనా అందుబాటులో ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే వారి దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎంఈఓ గురునాధరావు విశ్రాంతి ఉద్యోగి కానుగుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్టోన్ క్రషర్ల పరిశీలన

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండలంలోని స్టోన్ క్రషర్ మిల్లులను గురువారం అఖిలపక్షం నాయకుడు మైలారం జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు సందర్భంగా లోకాయుక్త ఎస్పి వెంకట్రావు, డీఎస్పీ విద్యాసాగర్ రావు, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, మండలంలోని పలు క్రషర్ మిల్లులనుపరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా స్టోన్ క్రషర్లను నడిపిస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఏ ఒక స్టోన్ క్రషర్లు నిబంధనలు పాటించడం లేదు వారిపై చర్యలు తీసుకుంటామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి వెంకన్న, జిల్లా మైనింగ్ అధికారి రాఘవరెడ్డి, తహసిల్దార్ శ్రీనివాస్, జిల్లా అసిస్టెంట్ మైనింగ్ డైరెక్టర్ రవికుమార్, జిల్లా మైనింగ్ డిజిటల్ సర్వేయర్ సుజాత, సీఐ చంద్రబాబు, ఎస్ఐ శ్రీశైలం, అధికారులు పాల్గొన్నారు.

## పాల సంఘం అధ్యక్షుడిగా మంచాల జంగయ్య

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలం జనగాం గ్రామంలో పాల సంఘం సొసైటీ ఎన్నికల నిర్వహించగా ఎన్నికల్లో అధ్యక్షుడిగా మంచాల జంగయ్య నాలుగవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మామిళ్ళ గోపాల్ రెడ్డి వ్యవహరించారు. డైరెక్టర్లుగా కొండూరు ముత్యాలు, కొండూరు చంద్రమ్మ, భద్ర బోయిన ఎల్లయ్య, భద్ర బోయిన శీను, రామ్ రెడ్డి, మంచాల నరసింహ, బెల్లంకొండ నరసింహ, ఐలయ్య పాల్గొన్నారు.

## సంతకాలు ఫోర్జరీ చేసిన వారిపై క్రిమినల్ కేసు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో మండల మెడికల్ ఆఫీసర్ సంతకాలు, స్టాంపులు ఫోర్జరీ చేసిన ఇంటర్నెట్, మీసేవ సెంటర్లో నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్డీవో శేఖర్ రెడ్డి ఆదేశించారు. ఒక్కో సర్టిఫికెట్ కు ఒక్కొక్క రేటు నిర్ణయించి అందిన కాడికి దోచుకుంటున్నారని, మండలంలోని కొందరు అధికారుల కంప్యూటర్ ఆపరేటర్ల కనుసన్నల్లో నడుస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్ రవీనా తన సంతకాన్ని ఫోర్జరీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై జగన్‌కు ఫిర్యాదు చేశారు. తహసిల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఇంటర్నెట్, మీసేవ కేంద్రాలను ఇక్కడ నుంచి షాపులను తరలించాలని ఆర్డీవో తాసిల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ మమత, ఎస్సై జగన్, ప్రొబిషనరీ ఎస్సై శివ శంకర్ రెడ్డి, అర్ఐ జుబేరుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు భరోసా, రుణమాఫీ రాని రైతులతో ఆందోళన చేస్తాం



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** రైతు భరోసా, రుణమాఫీ కాని రైతులతో మోటకొండూరు మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని మోటకొండూరు మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బొట్ల యాదయ్య హెచ్చరించారు ఆయన గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రైతు భరోసా ఇచ్చినామని గొప్పలు చెప్పుకుంటూ సంబరాలు చేసుకుంటున్నారని, చాలా మంది రైతులకు సగానికి సగం రైతు భరోసా వేయలేదని, పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదని రైతు భరోసా అందని, రుణమాఫీ కానీ రైతులతో మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. యువ వికాసం పేరిట ఎలాంటి లబ్ధి చేరలేదని, ఇందిరమ్మ ఇండ్లలో పారదర్శకతలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ నాయిని రామచంద్రారెడ్డి, మాజి మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల రవీందర్ రెడ్డి, మోటకొండూరు మాజీ ఎంపిటిసి పన్నాల అంజిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు భూమండ్ల సుధీర్, మార్కెట్ మాజీ డైరెక్టర్ అనంతల జంగారెడ్డి, ఆలేరు మాజీ పిఏసిఎస్ డైరెక్టర్ మరియు మండల యూత్ ప్రెసిడెంట్ బీస కృష్ణంరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, కొప్పుల శ్రీనివాసరెడ్డి, మండల మాజీఘు కోఆప్షన్ సభ్యులు యండి బురాన్, ఆలేరు నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి బొట్ల శ్రీనివాస్, జివిలికపల్లి వెంకటేష్, బోట్ల పాండు, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూమండ్ల యాదయ్య, మండల యూత్ ప్రధాన కార్యదర్శి పన్నాల నవీన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాల్ద లింగం, ఆరేగూడెం మాజీ ఉపసర్పంచ్ గాజుల దామోదర్, టౌన్ యూత్ అధ్యక్షులు బొట్ల మహేష్, సోషల్ మీడియా కన్వీనర్ గంధమల్ల మధు, మండల నాయకులు భూమాండ్ల బీరయ్య, నకీర్త ఉప్పలయ్య, బాల్ద అయిలయ్య, రేగు నాగులు, గాజుల శ్రీనివాస్, వంగపల్లి సురేష్, కొల్లూరి రాజు, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. మండలంలోని తుక్కాపురం, కూరెళ్ళ, పుల్లయిగూడెం, రాఘవాపురం గ్రామాల్లో సిసి రోడ్డులకు శంకుస్థాపన చేశారు. లింగరాజుపల్లి బీటీ రోడ్డు శంకుస్థాపన చేశారు. ఖప్రాయపల్లి గ్రామంలో సిసి రోడ్డు శంకుస్థాపన చేసి, వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని, అర్హులైన వారికి రేషన్ కార్డులను అందజేస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, ముద్దసాని సిద్ధులు, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ, శ్రీశైలం గౌడ్, మాజీ జెడ్పిటిసి నరేందర్ గుప్తా, పిఏసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, డైరెక్టర్ నోముల వెంకన్న, ఓబిసి మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, మండల మహిళా అధ్యక్షురాలు నవ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం వినోద, మండల నాయకులు భాషబోయిన పాపయ్య, కట్టెకుల హనుమంతు, దయ్యాల రాజు, పోతగాని మల్లేశం, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యకు పట్టాభిషేకం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరం పదవ, తొమ్మిదవ తరగతిలో అత్యద్భుత ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు విద్యా, వికాస పురస్కారాలతో పాటు నగదు పురస్కారంను గురువారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల చౌట1978–79 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు,ఆంగ్ల భాష విద్వాంసులు మరియు విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ఎంఎస్ కృష్ణమూర్తి 2024 25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యద్భుత ప్రతిభ కనబరిచిన బొమ్మగోని రామ్ చరణ్‌కు‘సిద్ధార్థి‘పురస్కారంతోపాటు నగదు పారితోషికము, పదవ తరగతి వార్షిక పరీక్షలో బాలికల విభాగములో ఆంగ్లములో అత్యద్భుత ప్రతిభ కనబరిచిన చేకూరి ఐశ్వర్యకు శ్రీ విద్యా పురస్కారముతో పాటు నగదు పారితోషికము మరియు బడుగు రామస్వామి కమలమ్మ వికాస పురస్కారమును తొమ్మిదవ తరగతి వార్షిక పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన షేక్ అఫ్రీన్ కు నగదు పారితోషికమును అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు వినయ, వివేక, వికాసంతో విద్యనభ్యసించి సౌశీల్యమును పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యకు పట్టాభిషేకం చేయడం కొరకు పిల్లల తల్లిదండ్రులు సేవా దృక్పథం కలిగిన పూర్వ విద్యార్థులు కృషి చేయాలన్నారు. జ్ఞానము వెనుక పరిగెత్తితే విజయం తనంతట తాను మీ దరి చేరుతుందని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.అనంతరం శివకుమార్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యుత్తమ విద్యను అందించడానికి కృషి చేస్తున్నామని, అదేవిధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుటకు డిజిటల్ విద్యా విధానములో విద్య ను విద్యార్థులకు అందిస్తున్నామని పేర్కొన్నారు .ఈ కార్యక్రమం లో బడుగు రామస్వామి కమలమ్మ ఫౌండేషన్ చైర్మన్ మరియు పాఠశాల పూర్వ విద్యార్థి శ్రీరాములు మాట్లాడుతూ విశ్లేషణాత్మక నైపుణ్యాలు, నిర్ణయాత్మక ఆలోచనలు, నవ కల్పనలు రూపుదిద్దుకోవడానికి కృత్రిమ మేధస్సు కన్నా మానవ మేధస్సును విద్యార్థులు పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కళ్లెం అంజిరెడ్డి, కర్నాటి సత్యనారాయణ గౌడ్, చింతల కరుణాకర్ రెడ్డి, బొబ్బిల్ల వెంకటేశ్వర కుమార్, అంబటి ప్రమీల, లలిత, దొమ్మాటియాదగిరి రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## గోవుల అక్రమ రవాణా అడ్డగింత

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :**ఆంధ్రప్రదేశ్ నుండి హైదరాబాద్‌కు అక్రమంగా 55 ఆవులను తరలిస్తున్న లారీని గురువారం చౌటుప్పల్ మండలం ఖైతపురం గ్రామ శివారు జాతీయ రహదారిపై బజరంగ్ దళ్ జిల్లా సహసమయోజక్ గోగు రవి నాయకులతో కలిసి వెంబడించి పట్టుకున్నారు. అనంతరం స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో గోవులను చల్లూరు గోశాల తరలించి లారీ సీజ్ చేసి డ్రైవర్ పై కేసు నమోదు చేశారు. బజరంగ్ దళ్ కార్యకర్తలు వివేక్, హేమంత్, నరేష్, అఖిల్, నరేష్‌లు పాల్గొన్నారు.

## నిత్యం వాహనాల తనిఖీ

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజల భద్రత కోసం నిత్యం వాహనాల తనిఖీ పోలీసులు నిత్యం వాహనాలను తనిఖీ చేయాలని జిల్లా ఎస్పి కె.నర్సింహా అన్నారు. గురువారంజిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పి రవీందర్‌రెడ్డితో కలిసి జిల్లా పోలీస్ అధికారుల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో పోలీస్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలన్నారు. నేరాల నమోదు, పెండింగ్ కేసులు, కోర్టు మానిటరింగ్, శిక్షల అమలు, డయల్ 100కాల్, సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ పనితీరు, పిర్యాదులపై స్పందన, అనుమానిత వ్యక్తుల కదలికలు తదితర అంశాలపై సమీక్షించిన ఆయన, ప్రతి గ్రామంలో పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. సూర్యాపేట, కోదాడ డిఎస్‌పి లు ప్రసన్నకుమార్, శ్రీధర్‌రెడ్డి, డిసిఆర్‌బి అధికారి హరిబాబు, సిఐలు చరమందరాజు, రజిత, శివశంకర్, రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, నర్సింహరావు, రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఆరుగురు ఎఎస్ఐలకు పదోన్నతి**

జిల్లాలోఆయాపోలీస్‌స్టేషన్లలోపనిచేస్తున్న ఆరుగురికి హెడ్ కానిస్టేబుళ్లకు ఎఎస్ఐగా పదోన్నతి లభించింది. గురువారం ఎఎస్ఐ లుగా పదోన్నతి పొందిన బి.రాంచందర్, బి.హనుమాన్, వెంకన్న, జి.చిన్నమల్లూర్, పి.ముత్తయ్య, ఎస్‌కె రహీముద్దీన్ లు జిల్లా ఎస్పి కె.నర్సింహాను కలిశారు. మన్ననలు పొందాలన్నారు

# ఎస్‌సి వర్గీకరణ ప్రకారమే ధృవీకరణ పత్రాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ చట్టంలో పేర్కొన్న విధంగా గ్రూప్ 1,గ్రూప్ 2 , గ్రూప్ 3 ప్రకారం కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ తెలిపారు.ఎస్‌సి వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ నేతృత్వంలో రాజీలేని పోరాటం చేసి విజయం సాధించిందని అన్నారు. ఈ ఎస్‌సి వర్గీకరణలో అన్ని శాఖల్లో రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కానీ ఎస్‌సి వర్గీకరణ ఫలాలు మాదిగలకు దక్కకుండా కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న విద్యా, ఉద్యోగ నియామకాల్లో మాదిగలు నష్టపోతున్నారని అన్నారు. కనుక ప్రభుత్వం ఈ విషయం మీద దృష్టి సారించి ఎస్‌సి వర్గీకరణ ప్రకారం కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని అన్నారు. అలాగే ఎస్‌సి ఉద్యోగుల ప్రమోషన్లలో కూడా ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఎంఆర్‌పిఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం జూలై 7 న ఘనంగా నిర్వహించాలని, జాతి జెండా పండుగగా భావించి జెండాను ప్రతి గ్రామంలో ఎగురవేయలని పిలుపునిచ్చారు.

## ఆసుపత్రిలో రోగులకు మెరుగైన చికిత్స

### యాదాద్రి కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** వివిధ సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్స అందించే విధంగా డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారంరామన్నపేటలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పరిసరాలను పరిశీలించి అక్కడ ఉన్న పరిస్థితులను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను క్షుణంగా పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి, వైద్య సిబ్బంది ఎంత మంది ఉన్నారని, ఎంత మంది విధులు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. ఐదుగురు డాక్టర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే ఎందుకు సస్పెండ్ చేయకూడదో తెలియజేయ వచ్చాన్నారు. విధులకు హాజరు కానీ డాక్టర్స్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదుగురు డాక్టర్‌లు విధులకు హాజరు కాకపోవడం డాక్టర్‌ల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్స్ సమయ పాలన పాటించాలని సమయ పాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది సూపరిండెంట్ దగ్గర లీవ్ మంజూరీ కాకముందే?ఎలా లీవ్ తీసుకుంటారని సూపరిండెంట్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. అందరూ సిబ్బంది సెలవుపై వెళితే హాస్పిటల్‌కి వచ్చే పేషెంట్లను ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నించారు. సిబ్బంది లీవ్ లెటర్స్‌ని పరిశీలించడం జరిగింది. అత్యవసర విభాగం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్ని సాధా రణ ప్రసవాలు జరుగుతున్నాయని, ఎంత మంది పేషంట్లు వస్తారని పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు వెయిటింగ్ హాల్‌లో వసతులు మరియు అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమర్జెన్సీ వార్డ్ ని కలియ తిరిగారు. ఆసుపత్రికి వచ్చిన వారిని పరీక్షల కోసం ప్రవేట్ ల్యాబ్‌కి పంపిస్తేచర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.

## దరఖాస్తులు ఆగస్టు 14 లోగా పరిష్కరించాలే




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భూభారతిలో వచ్చిన దరఖాస్తులను,రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు ఆగస్టు 14 లోగా పరిష్కరించాలని రెవెన్యూ కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు.గురువారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ రెవిన్యూ కి సంబంధించిన వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు ముందుగా రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ భూభారతి దరఖాస్తులను సమీక్షిస్తూ ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాల వారిగా పెండింగ్లో ఉన్న భూభారతి దరఖాస్తులపై సమీక్షించడం జరుగుతుందని, ఆర్డీవోలు ఆయా మండలాల వారిగా సమీక్ష నిర్వహించి వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 45313 దరఖాస్తులు రావడం జరిగిందని, వీటన్నింటిని ఆగస్టు 14 లోపు పరిష్కరించాలని, ముందుగా ఈ దరఖాస్తులన్నింటిని డేటా ఎంట్రీ పూర్తి చేయాలని చెప్పారు. ఇన్చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన 45,313 దరఖాస్తులలో 15000 దరఖాస్తులు మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి ఉన్నాయని, వీటి పరిష్కారం కోసం తక్షణమే మండలానికి మూడు బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో వనమహోత్సవం ,రేషన్ కార్డులు, తదితర అంశాలపై సమీక్షించగా, ప్రతి నెల చౌక ధర దుకాణదారులతో సమావేశాలు నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఆదేశించారు.దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి, తహసిల్దారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలాభివృద్ధి



**ప్రజాపక్షం/నూతన్‌కల్:** కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి జరుగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం మండల పరిధిలోని తాళ్ల సింగారం గ్రామంలో ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు నుండి రూ.20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని, ఎర్రపహడ్ గ్రామంలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు చేయడం చాల ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో సునిత, నాయకులు పాల్వాయి నాగరాజు, పసుల అశోక్ , అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి

### కోదాడ సహకార సంఘాన్ని సందర్శించిన టెస్కాబ్ అధికారులు



**ప్రజాపక్షం/కోదాడ:** వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు వాణిజ్య బ్యాంకులకు ధీటుగా అన్ని రకాల రుణాలు మంజూరు చేసి సహకార సంఘాలు అభివృద్ధిలో ముందుండాలని టెస్కాబ్ అధికారులు విజయ్‌శంకర్, సంపత్‌కుమార్ లు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలుస్తున్న ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘాన్ని శిక్షణలో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న పిఎసిఎస్ ఉద్యోగులతో కలిసి సందర్శించారు. అనంతరం చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులకు వ్యవసాయ రుణాలు మాత్రమే కాకుండా ఎంఎస్ఎంఇ పారిశ్రామిక, గృహభివృద్ధి, వర్తకులకు అప్పులు, క్యాస్ క్రెడిట్‌లు, విద్య రుణాలు, వ్యవసాయేతర అప్పులు, మల్టీపర్పస్ రుణాలు బ్యాంకు ద్వారా మంజూరు చేస్తే సంఘాలు అభివృద్ధి బాటలో నడుస్తాయని తెలిపారు. అనంతరం కోదాడ సంఘం నిర్మించిన గోదాములను పరిశీలించారు. పిఎసిఎస్ చైర్మన్ టెస్కాబ్ అధికారులను ఘనంగా సన్మానించారు. డిసిసిబి డైరెక్టర్ కొండా సైదయ్యగౌడ్, చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ బుడిగెం నరేష్, ఎజిఎం పి.వెంకటేశ్వర్లు, మేనేజర్ అశోక్, ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ, సొసైటీ డైరెక్టర్లు గుండాపునేని ప్రభాకర్‌రావు, పార్వతి, సిఇవో మందా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## హజారి గూడెం ప్రభుత్వ ఉపాధ్యాయుడికి డాక్టరేట్



**ప్రజాపక్షం/హాలియా:** అనుముల మండలం హజారిగూడెం గ్రామానికి చెందిన మేకల వెంకట్ రెడ్డికి ఉస్మానియా యూనివర్సిటీ రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డి డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫసర్ బ్రహ్మనందం పర్యవేక్షణలో తెలంగాణ పట్టణాలలోని పేదరిక నిర్మూలన కార్యక్రమాలు అనే అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ఇతను తెలంగాణ రాష్ట్ర సాధనకు గాను మలిదశ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా కీలక పాత్ర పోషించాడు. ప్రస్తుతం మండలంలోని చల్మారెడ్డి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజలు, మిత్రులు వెంకట్ రెడ్డికి డాక్టరేట్ రావడం పట్ల అభినందనలు తెలిపారు.

## సాధారణ ప్రసవ సమయంలో మలద్వారా కండరాల సమస్య

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సాధారణ ప్రసవ సమయంలో వచ్చే అతి కీలకమైన సమస్యలో ఒకటైన ఆసన కండరాలు లేదా మల ద్వారా కండరాల సమస్య ఒకటని, ఈ అంశంపై బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో డాక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ చైర్మన్ నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఓబీజీ డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి డాక్టర్ స్వరూప రాణి తెలిపారు.సుమారు 250 మంది డాక్టర్లు పాల్గొన్న ఈ కాన్ఫరెన్స్ ను ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటిసారిగా నిర్వహించడం జరిగిందని ఆమె చెప్పారు.ముఖ్యంగా సాధారణ ప్రసవం సమయంలో మలద్వారా కండరాల సమస్య అతి కీలకమైన సమస్య వస్తుందని, ఈ గాయం గురించి, అలాగే దానికి చేసే శస్త్ర చికిత్సకు సంబంధించిన నైపుణ్యాల గురించి ఈ సమావేశానికి హాజరైన డాక్టర్లకు ప్రత్యక్షంగా పంది మలద్వారా ప్రదర్శన ద్వారా ఇచ్చినట్లు తెలిపారు.జెఅండ్‌జె ఎతికాం కంపెనీ పంది మల ద్వారాన్ని ఏర్పాటు చేసిందని వెల్లడించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటిసారి ఇలాంటి కాన్ఫరెన్స్ నిర్వహించడం చాలా గర్వకారణమని అన్నారు.

## మదకద్రవ్యాల నిర్మూలణన ర్యాలీ




**ప్రజాపక్షం/చింతలపాలెం:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ, ఎంపిడివో, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది గురువారం మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

## కష్టపడి చదివితేనే ఉజ్వల భవిత



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు ఏర్పడుతుందని ఎంఈవో బాలునాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను పట్టణానికి చెందిన ప్రాఫిట్‌షూ కంపెనీ మేనేజర్ సుధాకర్ సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకోని అనేక మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. అదే విధంగా ప్రాఫిట్‌షూ కంపెనీ మేనేజర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు కంపెనీ చైర్మన్ కోటేశ్వర్‌రావు ఆదేశాల మేరకు ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేపడ్తామన్నారు.